సాక్షి
కామారెడ్డి
బుధవారం၊ 4၊ జనవరి၊ 2023



ఆగని ఇసుక దందా..
జుక్కల్‌లో ఇసుక దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. క్వారీల నుంచి ఇష్టారీతిన ఇసుకను తరలిస్తున్నారు.
- 8లో ▸



సావిత్రి బాయికి ఘననివాళి
సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో విద్యార్థులు చదువులో ముందుకు సాగాలని వక్తలు పేర్కొన్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /20.5
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొగ మంచు కురుస్తుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పంటల సర్వే వివరాల పరిశీలన



ఎల్లారెడ్డి : మండలంలో కొనసాగుతున్న పంటల వివరాల సర్వేను జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో జరుగుతున్న పంటల వివరాల సర్వేను ఆమె పరిశీలించారు. జీవామృతం ద్వారా తయారు చేసిన ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సంతోష్‌కుమార్, ఏఈవోలు రాజాగౌడ్, రవీందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై 1200పైగా అభ్యంతరాలు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్ నూతన మాస్టర్‌ప్లాన్‌పై మంగళవారం వరకు 1200లకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. పంటలు సాగు చేసుకునే భూములను ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చవద్దని, 100 ఫీట్ల రోడ్లు వేయవద్దని, తమ ప్లాట్ల నుంచి రోడ్లు వేయవద్దని, గ్రీన్ జోన్, కమర్షియల్ జోన్‌లను మార్చాలని రైతులు, యజమానులు అభ్యంతరాలతో దరఖాస్తులు చేస్తున్నారు. ఇంత అధికసంఖ్యలో అభ్యంతరాలు రావడంతో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం అయోమయానికి గురవుతోంది. అభ్యంతరాలను స్వీకరించేందుకు ఈనెల 11వ తేదీ వరకు గడువు ఉంది. లింగాపూర్, దేవునిపల్లి, ఇల్చిపూర్, టెక్రియాల్, సిరిసిల్లా రోడ్, అడ్లూర్ నుంచి అధిక సంఖ్యలో అభ్యంతరాలు వచ్చాయి.

సిద్ధరామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



భిక్కనూర్ : భిక్కనూర్ సిద్ధరామేశ్వర ఆలయాన్ని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆలయానికి విచ్చేసిన సుప్రియను ఆలయ కమిటీ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈవోలు శ్రీధర్, ప్రభు, వేద బ్రాహ్మణులు సిద్ధగిరి శర్మ, రాజేశ్వర శర్మ, శ్రీనివాస్ శర్మ, పూజారి సిద్దేష్, సిబ్బంది లక్ష్మణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు రైల్వే గేటు మూసివేత

భిక్కనూర్ : మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయ సమీపంలో ఉన్న రైల్వే గేటును మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు పట్టాల మరమ్మతుల పనుల్లో భాగంగా ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయానికి వచ్చే భక్తులు అండర్ బ్రిడ్జి ద్వారా దేవాలయానికి రావచ్చని ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మెన్ అందె మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ తెలిపారు.

5న ఓటర్ల తుది జాబితా విడుదల



కామారెడ్డి క్రైం : ఓటర్ల తుది జాబితాను జనవరి 5న విడుదల చేస్తామని ఎన్నికల అబ్జర్వర్ మహేశ్ దత్ ఎక్కా పేర్కొన్నారు. ఆయన మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌కు విచ్చేశారు. ఆయనకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 1 నుంచి 8 ఫార్మాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో ఓటర్ల ఆధార్ అనుసంధానం ప్రక్రియను 83.19శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 790 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవోలు శ్రీనివాస్ రెడ్డి, శీను, ఎన్నికల సూపరింటెండెంట్ సాయి భుజంగరావు, తహసీల్దార్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



వరి నాట్లు వేస్తున్న కూలీలు

యాసంగి జోరు!

- జిల్లాలో ఊపందుకున్న వరి నాట్లు
- పనుల్లో బిజీగా ఉన్న రైతన్నలు
- ఇప్పటికే 35 వేల ఎకరాల్లో నాట్లు

సాగునీరు పుష్కలంగా ఉండడంతో యాసంగి ఆశాజనకంగా 'సాగు'తోంది. ప్రాజెక్టులు, చెరువులన్నీ నిండుగా ఉండడం, బావులు, బోర్లు ఎత్తిపోస్తుండడంతో వరి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సాక్షి, కామారెడ్డి : ఈసారి యాసంగిలో 2.45 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు 35 వేల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. గడచిన వారం, పది రోజులుగా వరి నాట్లు జోరందుకున్నాయి. ఈనెల మూడో వారంలోపు పూర్తి స్థాయిలో వరినాట్లు పడతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టుల కింద ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతుంది. యాసంగి సాగుకు కావలసినంత నీరు ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండడంతో రైతులు వరి నాట్లు ముమ్మరం చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద వరి నాట్లు ఇప్పటికే చాలావరకు పూర్తయ్యాయి. పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఆదివారం నీటిని విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు కింద నాట్లు ముమ్మరం కానున్నాయి. కౌలాస్‌నాలా ప్రాజెక్టు కింద నాట్లు వేస్తున్నారు. అలాగే చెరువులు, మత్తడుల వద్ద వరి నాట్లు పడుతున్నాయి. నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, మాచారెడ్డి, రామారెడ్డి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి, పిట్లం, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, కామారెడ్డి తదితర మండలాల్లో వరి ఎక్కువగా సాగవుతోంది. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే నాట్లు పూర్తవగా, మిగితా గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. కొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే పనులు మొదలయ్యాయి.

సీజన్ ఆరంభంలోనే..
జిల్లాలో శనగ 84,699 ఎకరాల్లో సాగైంది. జిల్లాలో సీజన్ ఆరంభంలోనే రైతులు దుక్కులు దున్ని విత్తనం వేశారు. 90 వేల ఎకరాల్లో శనగ సాగవుతుందని అంచనా వేశారు. మద్నూర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం, జుక్కల్, బాన్సువాడ, గాంధారి, లింగంపేట, తాడ్వాయి, తదితర మండలాల్లో శనగ ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. కాగా మక్కజొన్న 27,255 ఎకరాల్లో పంట సాగైంది. 35 వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. కాగా జొన్న పంట 11,214 ఎకరాల్లో, గోధుమ 487 ఎకరాల్లో, పల్లి 1,355 ఎకరాల్లో, మినుము 395 ఎకరాల్లో సాగైంది.

జిల్లాలో..	
ఇప్పటివరకు	
వరినాట్లు (ఎకరాల్లో)	35 వేలు
శనగ (ఎకరాల్లో)	84,699
మక్క (ఎకరాల్లో)	27,255
విద్యుత్ వినియోగం	4.50 మిలియన్ యూనిట్లు

పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో వ్యవసాయ బోర్లు, బావులకు సంబంధించి లక్షా ఐదు వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. యాసంగి వరి నాట్ల కోసం బోరు, బావుల మోటార్లను కరెంటు ఉన్నంతసేపు నడిపిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. సాధారణంగా శీతాకాల సమయంలో రోజుకు 2.50 మిలియన్ యూనిట్లు వినియోగం అయ్యేది. ఈసారి ఒక్కసారిగా విద్యుత్ వినియోగం రెట్టింపైంది. 4.50 మిలియన్ యూనిట్ల మేర విద్యుత్ వాడుతున్నట్టు ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం పెరిగి అధికలోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయి. దీంతో పంటల సాగుకు ఆటంకం కలుగుతోంది.

అంచనాలకు మించి సాగవ్వొచ్చు

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం అంచనాకు మించి సాగవుతుందని భావిస్తున్నాం. గత ఏడాది వరి సాగు వద్దనడంతో రైతులు ఇతర పంటలు వేశారు. ఈసారి ఏ పంటైనా సాగు చేసుకోవచ్చని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు ఈ సారి వరికే ఎక్కువగా మొగ్గు చూపారు. దీనికి తోడు సాగునీరు పుష్కలంగా ఉన్నందున రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తున్నారు. –భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి

వినూత్న రీతిలో బోధనకు శ్రీకారం

- పాఠశాలల్లో టీఎల్‌ఎం మేళాలు ప్రారంభం
- సన్నద్ధమైన ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక విద్య అభివృద్ధిలో భాగంగా, విద్యార్థులలో కనీస సామర్థ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)ను ఉపయోగించి విద్యాబోధనను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధనోపకరణాలను ఉపయోగించి పాఠాలు చెప్పేలా గతేడాది ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. కాగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు అనుసరిస్తున్న కృత్యా ధార బోధన పద్ధతిలో భాగంగా తయారు చేసిన టీఎల్‌ఎంతో మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. మొదట మండలస్థాయి పోటీలు నిర్వహించి వాటిలో ఎంపికైన వారిని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు. ఇందుకోసం 1–5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులు ఉన్న కొన్ని రోజులుగా టీఎల్‌ఎం తయారీలో నిమగ్నమయ్యారు.

కమిటీల ఏర్పాటు
మండలస్థాయిలో నిర్వహించనున్న టీఎల్‌ఎం మేళా కోసం ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో ఆహ్వాన కమిటీ, అవసరాల కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీ, ఆర్గనైజేషన్ కమిటీ, డాక్యుమెంటేషన్ కమిటీ, న్యాయనిర్ణేతల కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. ఆహ్వాన కమిటీలో ఎంఈవో, నోడల అధికారి, కాంప్లెక్స హెచ్‌ఎంలు ఉంటారు. ఆర్గనైజేషన్ కమిటీలో తొలిమెట్టులో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు ఉంటారు. న్యాయనిర్ణేతల కమిటీలో ఉన్నత, గురుకుల పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు ఉంటారు. మిగతా కమిటీలలో నిపుణులైన ఉపాధ్యాయులు ఉంటారు.



చీనూర్ పాఠశాలలో బోధనోపకరణాలను తయారుచేస్తున్న ఉపాధ్యాయులు

అందరి భాగస్వామ్యంతో..
మండలస్థాయిలో నిర్వహించనున్న టీఎల్‌ఎం మేళాలలో ప్రజాప్రతినిధులను, ఎస్‌ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయనున్నారు. ఇందుకోసం ఇదివరకే మండల ప్రజాప్రతినిధులకు, ఎస్‌ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులకు టీచర్లకు సమాచారం ఇచ్చారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఎస్‌ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు టీఎల్‌ఎం మేళాకు హాజరై ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరాలను పరిశీలించనున్నారు.

నైపుణ్యాన్ని పెంచేందుకు..

విద్యార్థులలో భాషానైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారిలో విషయ అవగాహన కల్గించడానికి టీఎల్‌ఎం మేళా ఎంతగానో ఉప యోగపడనుంది. ఉపాధ్యాయులు కృత్యాధార బోధనకు అవసరమైన బోధనోపకరణాలను తయారు చేశారు. ఈ మేళా వల్ల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు మేలు కలుగుతుంది.
– రఘురాజ్, మండల నోడల్ అధికారి, నాగిరెడ్డిపేట

అర్థమయ్యే విధంగా బోధించాలి



ఉపకారణాలను పరిశీలిస్తున్న డీఈవో రాజు

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యే విధంగా బోధించాలని డీఈవో రాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం రామారెడ్డిలోని బాలికల పాఠశాలలో మండల స్థాయి మౌలిక సామర్థ్యాల ప్రగతి, ఉపాధ్యాయుల బోధన సామగ్రి మేళాను నిర్వహించారు. ఈ మేళాను ఎంపీపీ దశరథ్‌రెడ్డి ప్రారంభించగా, డీఈవో రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన ఉండాలనే ఉద్దేశ్యంతో రామారెడ్డిలో మొదటిసారి ఈ మేళాను నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎంఈవో యోసెఫ్, సర్పంచ్ సంజీవ్, హెచ్‌ఎంలు బాల్‌రాజు, బస్వరాజు, సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, ఉపసర్పంచ్ ప్రసాద్ ఉన్నారు.

'కంటి వెలుగు'కు 44 బృందాలు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : కంటి వెలుగు కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు. మంగళవారం మంత్రి దయాకర్ రావు, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌తో కలిసి వీసీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ, మొదటి విడతలో 1.54 కోట్ల మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. 54 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా కామారెడ్డి కలెక్టర్ జితేష్ విపాటిల్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం కోసం 44 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసే స్థలాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. వీసీలో కామారెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీఆర్‌డీవో సాయన్న, డీపీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

- నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు
- ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులతో మంత్రి ప్రశాంత్ రెడ్డి సమీక్ష

వేల్పూర్ : పచ్చని జీవితాలను విచ్ఛిన్నం చేస్తున్న గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపాలని రోడ్లు, భవనాలు, గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన వేల్పూర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్, కామారెడ్డి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంజాయి అసలు ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది, సరఫరా చేస్తున్న ముఠాలు, గంజాయి బారిన పడ్డవారు, నివారణకు తీసుకున్న చర్యలేమిటనే విషయాలను మంత్రి చర్చించారు. మంత్రి మాట్లాడుతూ గంజాయి సాగు, దాన్ని సరఫరా చేసేవారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేసి, కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకొని గంజాయి నిర్మూలనకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. బాల్కొండ నియోజవర్గంలోని కొన్ని ప్రాంతాలకు గంజాయి సరఫరా అవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఎక్కడినుంచి వస్తోందని పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి సరఫరా అవుతోందని పోలీసులు తెలపగానే, ఆ జిల్లా సీపీ ఉదయ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గంజాయి సాగుచేసేవారికి రైతుబంధు తొలగిస్తామని, పైగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నిజామాబాద్, కామారెడ్డి సీపీలు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి,ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

పెద్దచెరువుతో మహర్దశ!

- తొమ్మిది గ్రామాలకు అందుతున్న సాగు నీరు
- పాతికేళ్ల తర్వాత పొలంబాట పట్టిన రైతన్న
- బీబీపేట పెద్ద చెరువుకు జిల్లాలోనే అతిపెద్దదిగా గుర్తింపు
- చెరువు పరిరక్షణ సమితి కల నెరవేరిన వేళ

బీబీపేట: పాతికేళ్లుగా బీడుగా ఉన్న మూడువేల ఎకరాల్లో నేడు పచ్చదనం కనిపించనుంది. ప్రస్తుతం ఆ భూములకు సాగునీరందుతుండడంతో రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పాతికేళ్ల క్రితం బీబీపేట పెద్ద చెరువు సుమారు 3 వేల ఎకరాలకు సాగు నీరందించి ఎంతోమంది రైతులకు జీవనాధారంగా ఉండేది. కానీ కాలక్రమేణ కరువు, చెరువు పూర్తిగా నిండకపోవడంతో వేల ఎకరాలు బీళ్లుగా మారడంతో వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులు వలసలు వెళ్లారు. జిల్లాలోనే అతిపెద్ద చెరువుగా పేరున్న బీబీపేట పెద్ద చెరువు 510.02 ఎకరాల్లో విస్తరించి ఉంది.

ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు పెద్ద చెరువు నిండి అలుగు పారడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఎక్కడెక్కడో వలసలు పోయిన చిన్న, సన్నకారు రైతులు సొంత గ్రామాలకు చేరుకుని నడుం బిగించారు. తొమ్మిది గ్రామాల రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి గతనెలలో నీళ్ల విడుదల చేశారు. నేడు పెద్ద చెరువు కింద ఉన్న భూములన్నీ పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.



పెద్ద చెరువును పరిరక్షించాలని ఉద్యమం చేసిన పరిరక్షణ సమితి సభ్యులు (ఫైల్)

1995 తర్వాత కరువు..
పెద్ద చెరువు పూర్తిగా నిండకపోవడంతో 1995 తర్వాత బీబీపేట కరువు కోరల్లో చిక్కుకుంది. 1995లో నిండినటువంటి చెరువు కరువు పరిస్థితుల దృష్ట్యా నిండలేదు. 2016లో కురిసిన వర్షాలకు 16 అడుగుల మేర నీరు నిండింది. కానీ మిషన్ కాకతీయ పనుల్లో నాణ్యత లోపం వల్ల తూముల వద్ద లీకేజీలు ఏర్పడి పూర్తిగా నీళ్లు వెళ్లిపోయాయి. దాని తర్వాత మళ్లీ 2021లో పూర్తిగా 18 అడుగులు నిండి అలుగు పారింది. అప్పటి నుండి ఇప్పటి వరకు నీళ్లను చెరువులోనే ఉంచారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల చెరువు పూర్తిగా నిండింది. బీబీపేటతో పాటు ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, మల్కాపూర్, తుజాల్‌పూర్, శేరిబీబీపేట, మెదక్ జిల్లాలోని నస్కల్, నందగోకుల్, రాంపూర్ గ్రామాల పరిధిలో ఉన్నటువంటి సుమారు 3 వేల ఎకరాలకు సాగు నీరందిస్తుంది. పెద్ద చెరువుకు ప్రధానంగా పటేల్ తూము, మైసమ్మ, ఇలాయి, సొడు, ఏనుగుల తూము ఇలా ఐదు తూములు ఉన్నాయి. కానీ ప్రస్తుతం పటేల్, ఇలాయి, ఏనుగుల తూముల ద్వారా మాత్రమే నీటిని విడుదల చేశారు.

రైతుల కళ్లల్లో ఆనందం..
వందల కుటుంబాలకు బతుకునిచ్చి వారు సంతోషంగా గడపడానికి ప్రధానంగా కారణమైన ఈ చెరువు ప్రస్తుతం నీళ్ల నిండడంతో తూములు విడుదల చేశారు. చెరువు కింద ఉన్నటువంటి రైతులు ఇప్పటికే వరి నాటు సాగు కోసం వడ్లను తుకాలు పోశారు. కాలువల ద్వారా నీళ్లు రావడంతో తొమ్మిది గ్రామాల రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. ఉదయం లేచిన దగ్గరి నుండి సాయంత్రం వరకు పొలం పనులు చేసుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూర్తిగా నిండిన బీబీపేట పెద్ద చెరువు

ఉద్యమం చేసిన రైతాంగం

బీబీపేట పెద్ద చెరువు నింపేందుకు ఆయా ఆయకట్టు రైతులు గతంలో చెరువు పరిరక్షణ సమితిగా ఏర్పడి ఉద్యమం చేశారు. చెరువు నింపేందుకు 2014 నవంబర్ 16న రైతాంగం నిజామాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అంతే కాకుండా 2020లో చెరువును నింపేందుకు జలసాధన సమితి ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేశారు. చెరువు నింపేందుకు ప్రధాన ఆధారమైన కూడవెల్లి వాగు నుండి కాళేశ్వరం నీళ్లు తెప్పించాలని కోరుతూ రైతులు, అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. కాని వరుణుడు కరుణించి ప్రస్తుతం పెద్దచెరువు పూర్తిగా నిండింది.

మళ్లీ చూస్తాననుకోలేదు..



పెద్ద చెరువు కింద నాకు ఎకరం భూమి ఉంది. పాతికేళ్లుగా నీళ్ల లేక బీడు భూమిగా మారడంతో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాను. ప్రస్తుతం చెరువు నిండి తూముల ద్వారా నాకున్న ఎకరం పొలంలో ఇప్పటికే నారు పోశాను. ఇన్నేళ్లకు కల నెరవేరుతుందని, అసలు చెరువు నిండుతుందని కూడా ఊహించలేను. – బాల్‌రాజు, రైతు, బీబీపేట

నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం



చెరువు కింద ఎకరంన్నర ఉంది. దాంట్లో ఇప్పటికే నారు పోశాను. తూములు విప్పడంతో చేన్లలోకి నీళ్లు వచ్చి చేరాయి. దీంతో ఇప్పటికే నాకున్న భూమిలో పూర్తిగా చదును చేసి ఉంచాను. మరో వారం రోజుల్లో వరినాట్లు వేస్తాను. చెరువు నిండడమే కాకుండా తూములు విప్పాలని అందరం కూసోని తీర్మానం చేసుకున్నాం. – తంగెళ్లపల్లి నాగరాజు, ఉప్పర్‌పల్లి, రైతు

వరుణుడు కరుణించాడు..



బీబీపేట పెద్ద చెరువు ఎండిపోవడం వల్ల తొమ్మిది గ్రామాలకు సాగు నీరు, తాగునీరు అందక అల్లాడుతుండడంతో రైతులందరిని ఏకం చేసిన ఉద్యమానికి సిద్ధమయ్యాం. అలా చాలా ఏళ్లుగా చెరువు నిండడానికి ఎన్నో ఉద్యమాలు, రాస్తారోకోలు, నిజామాబాద్ వరకు పాదయాత్ర ఇలా ఎన్నో రకాలుగా నిరసనలు తెలిపాం. చెరువు పాతికేళ్లుగా ఎండిపోవడంతో దానిపైన ఆధారపడి ఉన్న కుటుంబాలు రోడ్డున పడ్డాయి. చివరికి వరుణుడు కరుణించాడు. – వెంకట్ రాంరెడ్డి, పెద్ద చెరువు పరిరక్షణ సమితి కన్వీనర్

క్లుప్తంగా

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


ముస్కు రవీనా

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ముస్కు రవీనా జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలయ్య, హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. రవీనా హైదరాబాద్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో పది రోజులు జరిగిన శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచిందన్నారు. దీంతో ఆమెను సబ్ జూనియర్ విభాగంలో జాతీయస్థాయికి ఎంపిక చేశారని చెప్పారు. సర్పంచ్ ఇందిర, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ హైమద్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.


అఖిల

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన అఖిల జాతీయ స్థాయి అండర్ -16 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. జక్రాన్‌పల్లి మోడల్ స్కూల్‌లో అఖిల ఇంటర్ సెకండియర్ ఎంఈసీ చదువుతోంది. గత నెల 21న హైదరాబాద్‌లోని హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. ఇందులో అఖిల ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఢిల్లీలో ఈ నెల 3 నుంచి 8 వరకు జరిగే 44వ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున అఖిల పాల్గొంటున్నట్లు కోచ్ గడ్డం శ్రీనివాస్ తెలిపారు. అఖిలను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, కోశాధికారి పవన్‌కుమార్, పడకల్ సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఎంపీటీసీ ఎస్ గంగారెడ్డి తదితరులు అభినందించారు.

ముగిసిన సీడీపీవో పరీక్ష

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ శివారులో గల క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో సీడీపీవో పోస్టులకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. మొత్తం 105 మంది అభ్యర్థులు సీడీపీవో పోస్టులకు దరఖాస్తు చేసుకోగా 66 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలను వేల్పూర్, ఆర్మూర్ డిప్యూటీ తహసీల్దార్‌లు శ్రీకాంత్, విజయ్‌కాంత్, ఆర్మూర్ ఆర్ఐ అశోక్ సింగ్ ఏఎల్‌వోలు పర్యవేక్షించారు.

నందిపేట ఉపాధ్యాయురాలికి అవార్డు



నందిపేట్: నందిపేట్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు సీహెచ్ వరలక్ష్మి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. మంగళవారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బీసీ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య


రవీందర్ (ఫైల్)

బీబీపేట: బీబీపేట చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ తొగిటి రవీందర్ (29) మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రవీందర్ ఆరేళ్ల క్రితం సీఐఎస్ఎఫ్(సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)లో ఉద్యోగం సాధించాడు. ఏడాది క్రితం హైదరాబాద్ శివారులోని హకీంపేటకు బదిలీపై వచ్చాడు. అయితే అక్కడే ఉన్న అటవీ ప్రాంతంలో చెట్టుకు యూనిఫారంలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆగని ఇసుక దందా..!

- అతివేగంగా వెళ్తున్న వాహనాలు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు


అఫ్రోజ్ మృతిపై హజ్జుల్‌లో రెవెన్యూ అధికారులు, పోలీసులను నిలదీస్తున్న ప్రజలు

బిచ్కుంద(జుక్కల్): మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఖద్గాం, శెట్లూర్, పుల్కల్, బీర్కూర్ మంజీర క్వారీ నుంచి ప్రతినిత్యం లారీలు, ట్రాక్టర్లు, బొలేరో గుడ్స్ వాహనాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. చీకటి పడితే చాలు మంజీరలోకి వాహనలు వెళ్తున్నాయి. రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో అక్రమ ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతోందనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలను అడ్డుకునే నాథుడు లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఖద్గాం, బీర్కూర్, శెట్లూర్ క్వారీలో వందల లారీల ఇసుక మంజీర ఒడ్డున డంపు చేస్తారు. అనుమతి ఉందని ప్రతినెల వారం పది రోజులు డంపు చేసిన ఇసుక రాత్రి సమయంలో తరలిస్తారు. వాహనాలకు నంబరు ప్లేటు తొలగిస్తారు. దొంగచాటున ఇసుక తరలిస్తుండడంతో లారీలు, ట్రాక్టర్లు, బొలేరో వాహనాలను ఆపడానికి ఎవరూ సాహసించవద్దని డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పుల్కల్ క్వారీ నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాలు

ఇసుక లారీ ఢీకొని గత ఏడాది గుండెకల్లూర్ గ్రామానికి చెందిన యాదవరావు మృతి చెందాడు. అలాగే బిచ్కుందలో బైక్‌ను ఇసుక లారీ ఢీకొనడంతో ఒకరు చనిపోయారు. ఆగ్రహించిన ప్రజలు నాలుగు లారీలను తగలబెట్టారు. గోపన్‌పల్లిలో ఇసుక లారీ అదుపుతప్పి రాత్రి సమయంలో గొర్రెల పాకలో దూసుపోగా 40 గొర్రెలు చనిపోయాయి. బిచ్కుందలో ప్రభుత్వ ఉద్యోగి విధులు ముగించుకొని వెళ్తుండగా వాజిద్‌నగర్ వద్ద ఇసుక లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏడాది క్రితం శాంతాపూర్‌లో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడానికి వెళ్లిన వీఆర్ఏను డ్రైవర్ ఢీ కొట్టాడు. తాజాగా మంగళవారం హజ్జుల్‌లో ఇసుక తరలిస్తున్న వాహనం ఢీకొనడంతో అఫ్రోజ్ అనే యువకుడు మృతి చెందాడు. చిన్నా చితక ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇసుక వాహనాలకు ప్రతి రోజు కొంత డబ్బులు చెల్లించాలని క్వారీ నిర్వాహకులు, ట్రాక్టర్ యజమానులతో అధికారులు ఒప్పందం చేసుకొని అక్రమ రవాణకు సహకారం అందిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారుల నుంచి ఒత్తిడి వస్తే లారీలు, బొలేరో పట్టకుండా ఒక ట్రాక్టర్ పట్టుకొని జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేస్తున్నాం

రాత్రి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని ప్రజలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టుకోవడం లేదనే ఆరోపణలు మా దృష్టికి వచ్చాయి. విచారణ చేస్తున్నాము. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ఖద్గాం, శెట్లూర్, పుల్కల్, హజ్జుల్ క్వారీల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వీఆర్ఏలను నియమించాం. ఇసుక అక్రమ రవాణా పూర్తిగా నియంత్రిస్తాం. – రవికాంత్, తహసీల్దార్, బిచ్కుంద

ఇసుక వాహనం ఢీకొని యువకుడి మృతి


అఫ్రోజ్ (ఫైల్)

బిచ్కుంద: మండలంలోని హజ్జుల్‌లో మంగళవారం ఇసుక లోడ్‌తో వెళ్తున్న బొలేరో గూడ్స్ వాహనం ఢీకొని గ్రామానికి చెందిన అఫ్రోజ్ (26) మృతి చెందాడు. వివరాలు.. అఫ్రోజ్ బిచ్కుంద వెళ్లడానికి ఉదయం ఏడు గంటలకు ఆటో స్టాండ్ దగ్గరకు వచ్చాడు. అక్కడి నిలబడ్డ ఆయనను ఖద్గాం క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తీసుకొని అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం అదుపు తప్పి ఢీ కొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అఫ్రోజ్‌ను వెంటనే అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బిచ్కుంద ఖద్గాం రోడ్డుపై బైఠాయించి పోలీసు, రెవెన్యూ అధికారులు రావాలని నినాదాలు చేశారు. దీంతో తహసీల్దార్ రవికాంత్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులకు అక్రమ ఇసుక డబ్బులు అందడంతో వాహనా లను పట్టుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖద్గాం, బీర్కూర్, కుర్లా మంజీర నది నుంచి నిత్యం అక్రమంగా 50 లారీలు, 30 బొలేరో గూడ్స్ వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. ఎవరు అడ్డురావొద్దని తెల్లవారు జామున అతివేగంగా వాహనాలు నడుతపుతున్నా రని పేర్కొన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ప్రమాదంలో యువకుడి ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నిజాలు నిగ్గు తేలేనా..!

- ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ
- బాల్కొండ మండలంలో బుధవారం నుంచి ప్రారంభం


బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు చూస్తున్న డీఆర్పీలు, ఎఫ్ఏలు

బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మూడు ఆర్థిక సంత్సరాల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు బుధవారం నుంచి నిర్వహించనున్నారు. మండల పరిధిలో పది గ్రామ పంచాయతీల్లో 2019 నుంచి 2022 వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో నిజాలు నిగ్గు తేల్చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టడానికి బృందాలు ఏర్పాడ్డాయి. మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో ఒక ఎస్ఆర్పీ, ఐదుగు డీఆర్పీలు, 10 మంది వీఎస్ఏలు తనిఖీలు నిర్వహించనున్నారు. మండల పరిధిలో రూ.6,63,32,772 తో సుమారుగా 300 పనులన చేపట్టారు. ఈ నిధులతో గ్రామాల్లో డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు నిర్మించారు. సిమెంట్ రోడ్లు కూడ వేశారు. కానీ పనుల్లో ఎంత మేరా నాణ్యత ప్రమాణాలు పాటించారో, పనులు సక్రమంగా చేపట్టారో లేదో తేల్చాల్సి ఉంది. సామాజిక తనిఖీ సక్రమంగా జరుగుతుందో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీల్లో నిజాలు బయట పెట్టే అవకాశం ఉంటుందా అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఈ మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేకుండానే జీపీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కలిసి పనులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు ఇప్పుడే కనిపించకుండాపోతున్నాయి. ఎలాంటి పనులు చేపట్టారో వారికే అర్థం కాని పరిస్థతిలో కొందరు ఉన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను ఎస్ఆర్పీ ఆధ్వర్యంలో డీఆర్పీలు, వీఎస్ఏలు చేపడుతారు. కానీ వీఎస్ఏలు నిపుణులు కారనే విమర్శలు వచ్చాయి. కళాశాలలో చదివే విద్యార్థులతో, నిరుద్యోగులను తాత్కాలికంగా వీఎస్‌లుగా నియమించుకొని తనిఖీలు చేస్తున్నారు. నిపుణులతో ఆడిట్ నిర్వహిస్తే లోపలు బయట పడే అవకాశం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

వీఎస్ఏలు చేపడుతారు..

గ్రామాల్లో బుధవారం నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రారంభం అవుతుంది. తనిఖీల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉండదు. వీఏస్ఏలే తనిఖీలు చేపడుతారు. – సంతోష్‌కుమార్, ఎంపీడీవో, బాల్కొండ

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని నెల రోజులుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించికపోవడం దారుణమని, వెంటనే వారికి న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి బానోత్ రఘురాం డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, ఏఓ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. రఘురాం మాట్లాడుతూ కోర్టు తీర్పును అమల్జేయకుండా ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మల్టిపుల్ ప్రశ్నల విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమల్జేయాలని, తప్పుడు ప్రశ్నలకు మార్కులు కలపాలని, ఈవెంట్స్‌ని పాత పద్ధతిలోనే నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రంజిత్, కుశాల్, సుభోద్, మధు, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులంతా కలిసి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్, చిత్రంలో ఆర్డీవో శ్రీనివాస్

- ఏసీపీ వెంకటేశ్వర్
- జక్రాన్‌పల్లిలో వీడీసీ, గౌడ కులస్తుల మధ్య కుదిరిన సయోధ్య

జక్రాన్‌పల్లి: గ్రామాల్లో ప్రజలు అందరు కలిసి మెలిసి ఉండాలని ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం మండల పరిషత్తు సమావేశం హాల్‌లో జక్రాన్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గౌడ కులస్తులతో ఏసీపీ, ఆర్డీవో శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి సమావేశమై చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఇరువర్గాల వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం ఇరువురి మధ్య సయోధ్య కుదిరింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కల్లు అమ్ముకునే విషయంలో వీడీసీకి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. స్వచ్ఛమైన కల్లును గ్రామస్తులకు అందించాలని సూచించారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న విధంగా స్వచ్ఛమైన కల్లును రూ.11కు విక్రయించడానికి గౌడ కులస్తులు ఒప్పుకున్నారని చెప్పారు. దీనికి వీడీసీ సభ్యులు సైతం గౌడ కులస్తులు వీడీసీకి ఎలాంటి డబ్బులు ఇవ్వడం అవసరం లేదని, స్వచ్ఛమైన కల్లును అందించాలని కోరారని తెలిపారు. ఈ విషయాన్ని ఎవరైన అతిక్రమించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ కమిటీ సభ్యులు గ్రామ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మోతే గ్రామ పంచాయతీ తరహాలో జక్రాన్‌పల్లి గ్రామం అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరడంతో గౌడ కులస్తులపై బహిష్కరణ ఎత్తివేయడానికి గ్రామ కమిటీ సభ్యులు ఒప్పుకున్నారని తెలిపారు. అధికారుల సమక్షంలో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయని చెప్పారు. వీడీసీ సభ్యులపై పెట్టిన కేసుల విషయం సంబంధిత శాఖ అధికారులు చూసుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ జక్కం చంద్రకళాబాల్‌కిషన్, ఎంపీటీసీ తలారి మరియా సతీష్, తహసీల్దార్ మల్లేష్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, వీడీసీ సభ్యులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన ఇరు వర్గాల ప్రజలు

గల్ఫ్ ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని వినతి


మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న బాధితుల కుటుంబ సభ్యులు

వేల్పూర్: వర్క్ వీసా పేరు చెప్పి, విజిట్ వీసాపై పంపించి మోసగించిన గల్ఫ్ ఏజెంట్ నిజామాబాద్ కేఎస్.ట్రావెల్స్‌కు చెందిన చిక్కెళ్లస్వామిపై చర్యలు తీసుకొని, తమ డబ్బులు ఇప్పించాలని గల్ఫ్ బాధిత కుటుంబాల వారు మైగ్రాంట్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డికి విన్నవించారు. గత ఏడాది ఆగస్టులో ఒక్కొక్కరి వద్ద రూ.82 వేల చొప్పున తీసుకొని మస్కట్, ఒమన్ దేశాలు విజిట్ వీసాపై పంపించాడని, వారికి పనిలేక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజిట్ కాలపరిమితి ముగియడంతో వారు ఒక్కొక్కరు రూ.లక్షా 20 వేలు చెల్లిస్తేనే తప్ప ఇంటికి రాలేని పరిస్థితి నెలకొందన్నారు. అంత డబ్బు చెల్లించే స్తోమత తమకు లేదని వాపోయారు. దాంతో మంత్రి వెంటనే సీపీ నాగరాజుతో మాట్లాడి ఏజెంట్‌పై పీడీ యాక్టు నమోదు చేసి, బాధితుల డబ్బులు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


డీసీపీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఖలీల్‌వాడి: మస్కట్, ఓమన్ దేశాలకు విజిట్ వీసాపై పంపించి మోసం చేసిన గల్ఫ్ ఏజెంట్ చిక్కెల స్వామిపై చర్యలు తీసుకోవాలని బాధితుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు డీసీపీ అరవింద్ బాబుకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం గల్ఫ్ బాధితుల సంఘం నేత కోటపాటి నర్సింహ నాయుడు ఆధ్వర్యంలో డీసీపీని కలిశారు.

ఆయిల్‌పామ్‌తో లాభాలు

సిరికొండ: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సింగ్‌దాస్ పేర్కొన్నారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తుందని వివరించారు. ఏవో వెంకటేష్, సర్పంచ్ దేవాగౌడ్, ఎంపీటీసీ గంగారం, ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ గంగాధర్, ఏఈవో శివాని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి


ఉపాధ్యాయులను సన్మానించిన డీఈవో దుర్గాప్రసాద్

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

పెర్కిట్: సమాజంలో మిగతా ఉద్యోగాల కన్న ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఎమ్మార్ గార్డెన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 50మంది ఉపాధ్యాయులను సన్మానించారు. మహిళల చదువు కోసం పాటు పడిన సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివన్నారు. ఎంపీపీ నర్సయ్య, తెయూ రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

కత్తితో దాడి చేసిన ఆటోడ్రైవర్ అరెస్టు

ఖలీల్‌వాడి: ఆటో ఎక్కనందుకు ప్రయాణికుడిపై దాడి చేసిన డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు ఐదో టౌన్ ఠాణా ఎస్సై సాయినాథ్ తెలిపారు. వివరాలు.. నాగారం 300 క్వార్టర్స్‌కు చెందిన రామగిరి ప్రవీణ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఆటో ఎక్కే విషయంలో డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ నోమన్ గొడవ పెట్టుకున్నాడు. ప్రవీణ్‌ను కొట్టి కత్తితో గాయపరిచాడు. ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మంగళవారం నోమన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతని వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదేవిధంగా ఉన్నతాధికారుల సూచన మేరకు నోమన్‌పై రౌడీషీట్ కూడా ఓపెన్ చేశామన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ధర్పల్లి: మండలంలోని రామడుగు, రేకులపల్లి గ్రామంలోని వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

ఒకరి అదృశ్యం

ధర్పల్లి: తన భర్త కనిపించడం లేదంటూ ఓ మహిళ ధర్పల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హోన్నాజీపేట్ గ్రామానికి చెందిన వరికుప్పల మల్లేష్ తన భార్యతో ఇంట్లో చిన్నపాటి గొడవపడి మంగళవారం ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో భార్య శిరీష పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


మాన్య (ఫైల్)

మాక్లూర్: మండలంలోని మానిక్‌భండార్ తండాకు చెందిన నునావత్ మాన్య(38) సౌదిలో మృతి చెందగా ఆయన మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. కార్పొరేటర్ రాజాసింగ్ తెలిపిన వివరాలు.. మాన్య సౌదీ వెళ్లిన నెల రోజులకే ఫిట్స్ వచ్చి పని చేస్తున్న కంపెనీలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన గల్ఫ్ బాధిత సంఘం నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు, ఎమ్మెల్సీ కవితకు విషయాన్ని తెలిపారు. స్పందించిన వారు మృతదేహం స్వదేశం వచ్చేలా చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం మాన్య మృతదేహం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రాగా ఎమ్మెల్సీ కవిత అంబులెన్సు సమకూర్చి స్వగ్రామానికి పంపించారు.

రైలులో నుంచి పడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: రైలులో నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన భిక్కనూర్ – అక్కన్నపేట్ రైల్వే స్టేషన్‌ల మధ్య మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గుర్తు తెలియని రైలులో నుంచి 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోయాడు. కంకర రాళ్లపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి ఆనవాళ్లు తెలియలేదు. మృతుడి కుడి చేయిపై శ్రీ, ఛాతిపై అమ్మ, నాన్న, దుర్గమ్మ అనే పచ్చబొట్లు ఉన్నట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. అతడిని ఎవరైనా గుర్తిస్తే కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్ హత్య కేసు నిందితులు?

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగపూర్‌లో రౌడీషీటర్ ఇబ్రహీం చావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు(29) హత్య కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆదివారం హర్షద్ పుట్టిన రోజు వేడుకల్లో రౌడీ షీటర్లు ఇబ్రహీం చావూస్, అర్షద్ డాన్‌తో పాట విషయంలో వాగ్వివాదంతో దాడులు చేసుకున్నారు. దీంతో ఇబ్రహీంను ఆరిఫ్ అతని అనుచరులు కత్తులతో దాడి చేసి హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆరిఫ్‌తో పాటు కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది.

వివాహితతో చనువుగా ఉంటున్నాడని..

- యువకుడిని హతమార్చిన ఆమె కుటుంబ సభ్యులు
- చాట్ల శివకుమార్ హత్యకేసును ఛేదించిన పోలీసులు
- ఐదుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కిరణ్‌కుమార్



బోధన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్: వివాహితతో చనువుగా ఉంటున్న యువకుడిని ఆమె కుటుంబ సభ్యులు హతమార్చారు. బోధన్ పట్టణం నర్సాపూర్ శివారులో సోమవారం అర్ధరాత్రి హత్యకు గురైన చాట్ల శివకుమార్(22) కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి తండ్రి గోపి తన కొడుకు హత్యపై పారుగింటి వారిపై అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ కిరణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. శక్కర్‌నగర్ ప్రాంతంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చాట్ల గోపి నిజామాబాద్ నగరంలోని నాందేవ్ వాడలో ఉంటున్నాడు. ఆయన కుమారుడు శివకుమార్ కొద్దికాలంగా శాంతినగర్‌లో ఉంటున్నాడు. శివకుమార్ పొరిగింటి రుక్మిణి అలియాస్ రాణి కోడలు సోనితో సన్నిహితంగా ఉంటున్నాడు. పలుమార్లు హెచ్చరించిన వైఖరి మార్చుకోకపోవడంతో ఆయనను హతమార్చాలని రాణి, ఆమె కుమారుడు రంజిత్(29), అల్లుళ్లు అరుణ్(36), మానే శివకుమార్(28), దండే సునీల్(25) పథకం వేశారు. ఈ క్రమంలో డిసెంబర్ 31 అర్ధరాత్రి కొత్త సంవత్సర వేడుకల్లో రంజిత్ భార్యతో చాట్ల శివకుమార్ సన్నిహితంగా మెలగడం వారిలో కోపాన్ని రగిల్చింది. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్న శివను రంజిత్ గొడ్డలితో తల వెనుక భాగంలో బలంగా కొట్టాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన శివను అల్లుడు అరుణ్ తన కారులో వేసుకుని నిందితులతో నర్సాపూర్ శివారులో తీసుకెళ్లి గొడ్డలితో దారుణంగా నరికి చంపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్టు అంగీకరించారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును 24 గంటల్లో ఛేదించిన సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై నవీన్, వర్ని ఏఎస్సై బాబురావు, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, యాదగిరిని ఏసీపీ అభినందించారు. వీరికి సీపీ నాగరాజు రివార్డులు అందజేస్తారని చెప్పారు.